# యూజ్ అండ్ త్రో

● మువ్వా శ్రీనివాస్ ●

## "నేను చరిష్మాతో రాత్రంతా గడిపాను తెలుసా" అన్నప్పుడు మా ఆఫీసు స్టాఫంతా క్యాంటిన్‌లో ముక్కుమీద వేలేసుకున్నారు.

ఎంతో ఆశ్చర్యపోయారు. "ఆహా... అదృష్టమంటే నీదేనోయ్. ప్రేమించడం మొదలెట్టి ఓ నెలైనా కాకుండానే నీతో రాత్రి గడవడానికి ఆమె వప్పుకుందంటే ఎంతైనా నువ్వు ఘటికుడివే. ఇంతకీ ఆమె బాగా కో ఆపరేట్ చేసిందా" లాంటి ప్రశ్నలతో నన్ను ఎంతో అభినందించారు.

అందరికీ నేను ఎప్పటికప్పుడు చెప్తూనే వుంటాను చరిష్మాతో నా ప్రేమాయాణం గూర్చి.

ఆ ఇంట్లోకి నేను అద్దెకి దిగి దాదాపు నెలకన్నా ఎక్కువే అయింది. మేడ మీద నాలానే ఒంటరిగది. మేడ మీద పూలకుండీలు మల్లెతీగలు... ఎంతో బావుంటుంది. వెన్నెల రాత్రి అలా మేడ మీద పడుకుని మల్లెల వాసన ఆఘ్రాణిస్తూ ఆకాశంకేసి చూస్తుంటే ఆనందంతో మనసు పావురమై ఆకాశంలోకి ఎగురుతున్నట్లనిపిస్తుంటుంది.

ఆ ఇంట్లోకి చేరిన మొదటి రోజు 'చరిష్మా' అంటూ ఆమెని పక్క ఇంట్లోంచి పిలుస్తుంటే 'వెరీనైస్ నేమ్' అనుకున్నాను. బహుశ ఎవరైనా చిన్నపిల్లేమో అనిపించింది. కానీ తర్వాత రోజు తెలిసింది. మేడ మీద నుంచి వాళ్ళ మమ్మీ 'చరిష్మా' అంటూ పిలుస్తుంటే పరుగెత్తుకుంటూ "ఏంటీ మమ్మీ' అంటూ వచ్చిన ఆ అమ్మాయిని చూసి 'ఆహా మెరుపు తీగలా వుంది' అనిపించింది. కళ్ళు జిగేల్‌మన్నాయి. పేరుకన్నా అందమైన స్వీట్ సిక్స్‌టీన్ దాటిన ఆ అందాల భరిణెను చూసి నా హృదయంలో భూకంపం పుట్టుకొస్తున్నట్లనిపించింది.

నేను అలా కన్నార్పకుండా ఆమెవైపు చూడటం ఆమె కళ్ళార్పుతూనే గమనిస్తోంది. అలా లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లో ఆనాటి నైట్ నిద్ర లేకుండానే ఆమె ఆకారాన్ని ఆమె అందాల్ని సోయగాల్ని అంతకుమించిన హొయల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ గడిపాను. అలా మొదలైన మా ప్రేమ తర్వాత రోజు నుంచి మరో రోజుకు మరో అడుగు చొప్పున ముందుకేసుకుంటూ ఆమెను చూడకుండా నేను నన్ను చూడకుండా ఆమె వుండలేని స్థితికి చేరుకుని ఎంతో దగ్గరైపోయాం.

ఈ నెల్లాళ్ళలోనే మా ప్రేమ మరింత గట్టిపడింది. ఉన్నట్లుండి వాళ్ళ నాన్నమ్మకు సీరియస్‌గా వుందంటే ఆమె అమ్మానాన్న తమ్ముడు హడావుడిగా బయలుదేరి ఊరెళ్ళారు.- ఎంతో అసైన్‌మెంట్ వున్నాయంటూ ఇంట్లో ఒక్కతే మిగిలిపోయింది.

సాయంత్రం మేడ మీదికొచ్చి పూలుకోస్తూ ఓ మల్లెమొగ్గను ప్రేమబాణంలా విసిరింది. దగ్గరకెళ్ళాను. "మా పేరెంట్స్ వూరెళ్ళారు. ఇంట్లో రాత్రికి నేనొక్కదాన్నే" అంది. "అలాగా" అన్నాను. "మా తమ్ముడు కూడా లేడు. ఒక్కదాన్నే పడుకోవాలంటే భయం. కాస్తతోడు పడుకోవచ్చుగా!" అంది బుంగ మూతిపెడ్తూ. ఆమె అలా డైరెక్టు ఎటాక్ ఇచ్చేసరికి ఎంతో సంతోషపడిపోయాను. అలా కాకుండా ముందే మనం పడుకుంటామని అంటే ఆమె మరోలా భావించి... ఎందుకంటే ఆడవాళ్ళ మాటలకే కాదు భావాలకు కూడా అర్థాలు వేరు. "అయితే రాత్రికి మెస్‌కు వెళ్ళమాకండి. భోజనం మా ఇంట్లోనే చేద్దురుగాని" అంది.

రాత్రి టీ.విలో ఇంగ్లిష్ న్యూస్ వచ్చే సమయానికి వెళ్ళాను. ఇద్దరం కలిసి భోంచేశాం. ఇల్లంతా చూపించింది. చాలా పెద్ద ఇల్లు.

డ్రాయింగ్ రూమ్‌లో టీవీ ముందు కూర్చున్నాం. టీవిలో స్టార్ టీవి ప్రోగ్రామ్స్ వస్తున్నాయి. గోడ గడియారం పది గంటలు చూపిస్తోంది. బయట వెన్నెలవర్షం వింతగా పడుతోంది. ఆ గదిలో చరిష్మా తలలోని విరజాజులు గుప్పుమంటూ వాసనని విరజిమ్ముతున్నాయి.

సోఫాలో రిలాక్సుడుగా కూర్చున్న చరిష్మా వైపు చూశాను. రోజ్‌కలర్ నైటీలో చాలా ఎగ్జయిటింగా వుంది. కానీ చరిష్మా టీ.వి ప్రోగ్రామ్‌ను చాలా సీరియస్‌గా వాచ్ చేస్తోంది. నేను మాత్రం ఆమె వైపే చూస్తుండిపోయాను.

మధ్య మధ్యలో నా వైపు చూసి నవ్వుతూ పలకరిస్తోంది. ఓసారి మాత్రం అడిగింది "ఏంటీ అలానే చూస్తున్నావ్" ఏం సమాధానం చెప్పాలి? 'నా హృదయానికి భౌతిక రూపం ఎదురుగా వుంటే చూడకుండా ఎలా వుండను' అని మనసులో అనుకుని అదే బయటకనేశాను. ఆ మాటలకు ఆమె బుగ్గలు సిగ్గుతో ఎర్రమందారాలైనాయి. "రియల్లీ ఐ లవ్యూ" అన్నాను తమకంతో.

టీ.వి.లో 'టాప్ వీడియో కౌంట్ డౌన్' ఎంటీవి ప్రోగ్రామ్ వస్తోంది. అప్పటికే ఊరంతా గాఢ నిద్ర పరిష్వంగంలో నలిగిపోతోంది. చాందినీ రాత్‌కాచాంద్ కిటికీ లోంచి కనిపిస్తున్నాడు. అదే ఆమెకు చూపించాను. "చాలా

● ● ●

**నా హృదయానికి భౌతిక రూపం ఎదురుగా వుంటే చూడకుండా ఎలా వుండను?**

● ● ●

బావుంది కదూ" అంది. వెంటనే అందుకుని "నీలాగే" అని జత చేశాను. ఆమె వెంటనే నవ్వింది.

"టీ.వీ ఆఫ్ చేయనా" అంది. "ఏం నిద్రొస్తుందా" అడిగాను. "ఊహు... రావడం లేదు" అంది. "మరైతే వుంచు. నాకు ఎంటీవి. ప్రోగ్రామ్స్ అంటే భలే ఇంట్రస్టు. నేను మైకేల్ జాన్సన్ అంటే పడి ఛస్తాను తెలుసా?" అన్నాను. టీవిలో 'వీక్ ఇన్ ది రాక్' వస్తోంది.

సోఫాలో కూర్చొని ఆమె కునికిపాట్లు పడుతోంది. గడియారం కేసి చూశాను. ఆశ్చర్యం అప్పటికే అర్ధరాత్రి దాటి తెలతెలవార బోతున్న సమయం. టీ.వీ ఆఫ్ చేశాను. "దాదాపు



**●●●**

## ఆశ్చర్యం! అప్పటికి అర్ధరాత్రి దాటి తెలతెలవారబోతున్న సమయం.

**●●●**

తెల్లవారి పోయింది. ఇక నీకు భయం లేదుగా. నేను మా రూమ్‌లోకి వెళ్ళి పడుకుంటాను" అని అక్కడ్నుంచి కదిలాను.

నిన్న రాత్రి జరిగిందది. అదే మా వాళ్ళతో చెప్పాను. అంతా విన్నాక మా వాళ్ళు చాలా తేలిగ్గా కొట్టి పరేశారు. మేం నమ్మలేం అన్నారు. "చూడు... అందుబాటులో వున్న ఓ అందమైన పడుచు అమ్మాయితో ఏకాంతంలో ఓ రాత్రిని అందమైన రాత్రిగా మలుచుకోవడం దాన్ని అవ్వాయకుడివే కాదన్న విషయం మాకు తెలుసు" అన్నారు. అప్పుడు నాకు కించిత్ కోపం రాక మానలేదు.

"ఇంతకీ మీరు మా ప్రేమ గూర్చి ఏమనకుంటున్నారు. మాది అశరీర ప్రణయం. మేం మనసులతో ఒకరినొకరు ప్రేమించు కుంటున్నామే కానీ శరీరాలతో కాదు. అంతా పెళ్ళయిన తరువాతే. మాది నిజంగా చెప్తున్నాను స్వచ్ఛమైన ప్రేమ" అప్పుడన్నారు వాళ్ళిలా "చూడు అబ్బాయ్. ప్రేమంటే యూజ్ అండ్ త్రో టైపులా వుండాలి కానీ ఇలా 'కీప్ ఇట్ ఫరెవర్'లా కాదు.

"ఇంతకీ ఆ అమ్మాయిది ఏ ప్రేమో తెలుసుకున్నావా? ఊరు కాని ఊరు వాడివి పొరుగు రాష్ట్రం వాడివి నిన్ను ఆ అమ్మాయి పెళ్ళి చేసుకుంటానికి వప్పుకుందా. ఆమె వప్పుకున్నా వాళ్ళ తల్లిదండ్రులు వప్పుకోవాలి కదా. అలా వాళ్ళు అంగీకరించకపోతే. వాళ్ళని ఎదిరించి నీతో లేచి వచ్చేయటానికి ఆమె సిద్ధపడగలదా. ఏమో ఇవ్వన్నీ పెద్ద డౌట్స్. మా ఉద్దేశ్యం ప్రకారం ఆ అమ్మాయిది యూజ్ అండ్ త్రో లవ్వేనని."

ఆ రోజు సాయంత్రం పూలు కోయడానికి మేడ మీదకొచ్చింది చరిష్మా. దగ్గరగా వెళ్ళాను. "హాయ్ చరిష్మా" అంటూ విష్ చేశాను. "నీకో విషయం తెలుసా. రాత్రి నీతో గడిపిన మధుర క్షణాలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. అదే మా స్టాఫ్‌కు చెప్పాను. కానీ వాళ్ళు నమ్మడం లేదు తెలుసా. మనది స్వచ్ఛమైన ప్రేమని, అందుకే కనీసం నీ చేతినైనా తాకలేదని చెప్తే వాళ్ళేమన్నారో తెలుసా... నువ్వు ఫైవ్ బైటీన్ గాడిదయితే అయ్యుండొచ్చు. కానీ ఆ అమ్మాయికి కోరిక వుండి వుండవచ్చు గదా... ఎర్రగా బుర్రగా వున్న నీతో ఆ ఎక్స్‌పీరియన్స్ ఎలా వుంటుందో మొదటిసారిగా చవి చూడాలనే కోరికతోనే నిన్ను పిలిచి వుండొచ్చు కదా అన్నారు. అదీ గాక ప్రేమంటే యూజ్ అండ్ త్రో టైపులా వుండాలని కూడా అన్నారు..." అంటూ చెప్పుకుపోయాను.

అప్పుడు ఆమె పూలన్నీ కోసుకుని కిందకి వెళ్తూ వెళ్తూ అంది కదా... "మరి అనరా ఏంటి!?" ●